సమాచారం

కీసర వాహనాల పార్కింగ్ వేలం ఖరారు

కీసర: కీసరగుట్ట వాహనాల పార్కింగ్‌ను ఆన్‌లైన్ టెండర్ విధానంలో బోడుప్పల్ వాసి విజయ్‌కుమార్ రూ 27,11,770 కి దక్కించుకున్నట్లు సోమవారం కీసర గ్రామకార్యదర్శి సురేష్‌రెడ్డి తెలిపారు. ఇటీవల కీసరగుట్ట వాహనాల పార్కింగ్‌కు సంబంధించి ఆన్‌లైన్ టెండర్‌లు పిలిచారు. బోడుప్పల్‌కు చెందిన విజయ్‌కుమార్ ఆన్‌లైన్‌లో ఎక్కువ కోట్‌చేసి పార్కింగ్ వేలం పాట దక్కించుకున్నట్లు తెలిపారు. మొదటి విడతకు సంబంధించి రూ .9 లక్షలు ఈనెల 14లోగా ఆన్‌లైన్ ద్వారా జమచేయాల్సి ఉంటుందన్నారు. వేలం దక్కించుకున్న వారు కీసరగుట్టలో ఈనెల 15 నుంచి వచ్చే ఏడాది పాటు వాహనాల పార్కింగ్ రుసుమును వసూలు చేసుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు.

నేడు పీఎంఈజీపీపై అవగాహన సదస్సు

సాక్షి,మేడ్చల్ జిల్లా: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా పరిశ్రమల కేంద్రం అండ్ ఖాదీ గ్రామీణ పరిశ్రమల కమిషన్ ఆధ్వర్యంలో ప్రధాన మంత్రి ఉపాధి కల్పన పథకం (పీఎంఈజీపీ)పై మంగళవారం ఈసీఐఎల్, కమలానగర్(కాప్రా)లోని ఎన్ఎస్ఐసీలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అవగాహన సదస్సును నిర్వహిస్తున్నట్లు జిల్లా పరిశ్రమల శాఖ జీఎం రవీందర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సులో పథకంపై విధివిధానాలు, దరఖాస్తు విధానం, కావలిసిన దస్త్రాలు మొదలైన అంశాలపై అవగాహన కల్పిస్తామన్నారు. 18 ఏళ్లు నిండిన యువత, స్వయం సహాయక బృందాలు, సొసైటీ చట్టం 1860 కింద నమోదైన సంస్థలు, ఉత్పత్తి సహకార సంఘాలు, ట్రస్టులు ఆర్థిక సాయం పొందేందుకు అర్హులన్నారు. తయారీ రంగ పరిశ్రమలకు గరిష్ఠంగా ప్రాజెక్టు వ్యయ పరిమితి రూ.50లక్షలు, సేవా రంగ పరిశ్రమలకు రూ.20 లక్షలు అందించనున్నట్లు పేర్కొన్నారు. ఈ పథకంలో 25 నుంచి 35 శాతం వరకు సబ్సిడీ ఉంటుందన్నారు. జిల్లాలోని నిరుద్యోగ యువత, స్వయం సహాయక బృందాలు పాల్గొనాలని ఆయన కోరారు. మరిన్ని వివరాలకు జిల్లా పరిశ్రమల శాఖ ఉప సంచాలకులు వెంకటేశ్వర్లు (9440412398)ను సంప్రదించాలన్నారు.

నర్సింహారెడ్డి కళాశాలలో ఎఫ్‌డీపీ ప్రారంభం

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడలోని నర్సింహారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో 'మిషన్ లర్నింగ్'పై ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్న (ఎఫ్‌డీపీ) ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ సోమవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా కన్వీనర్ దిలీప్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రస్తుత సమస్యలకు పరిష్కారాలను డీప్ లర్నింగ్, వర్గీకరణలను ఉపయోగించి పరిష్కరించవచ్చని, వారం రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమాన్ని అధ్యాపకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి త్రిశల్‌రెడ్డి, కోశాధికారి తిలోక్‌రెడ్డి, డైరెక్టర్ డా.మోహన్‌బాబు, ప్రిన్సిపాల్ లోకనాథ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

9వ వార్డులో కంటి వెలుగు



కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్ కొండల్‌రెడ్డి


పోచారం: అన్నోజిగూడ రాజీవ్ గృహకల్ప కాలనీలోని 9వ వార్డులో కంటి వెలుగు శిబిరాన్ని చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీవాసులంతా కంటి పరీక్షలు చేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో కమిషనర్ సురేష్, స్థానిక కౌన్సిలర్ మెట్టు బాల్‌రెడ్డి, వైద్య బృందం పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలను ఎండగడదాం

ఘట్‌కేసర్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను ఎండగడదామని భారతీయ మజ్దూర్ సంఘ్(బీఎంఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శి ధనంజయగౌడ్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి ఫిబ్రవరి 14న బీఎంఎస్ నిర్వహించ తలపెట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమానికి అధిక సంఖ్యలో కార్మికులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

మల్లన్న జాతరకు బీఆర్ఎస్ నేత విరాళం

మేడ్చల్: గౌడవెల్లి గ్రామంలో యాదవులు నిర్వహిస్తున్న మల్లన్న జాతరకు గ్రామానికి చెందిన బీఆర్ఎస్ యువ నాయకుడు అప్పమ్మగారి రాజ్‌గోపాల్‌రెడ్డి రూ.21వేల విరాళం అందజేశారు. ఆలయ ఆవరణలో సోమవారం ఆయన నిర్వాహకులకు అట్టి నగదు అందజేయగా నిర్వాహకులు రాజ్‌గోపాల్‌రెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, యాదవ సంఘం సభ్యులు పాల్గొన్నారు.



రిజిస్టర్లు, కాగితాల విధానాలకు.. ఇక స్వస్తి!

అంగన్వాడీ కేంద్రాల సేవల పారదర్శకతకు ప్రత్యేక యాప్

- పనులన్నీ న్యూట్రిషన్ హెల్త్ ట్రాకింగ్ సిస్టమ్ యాప్ ద్వారా పర్యవేక్షణ
- 15 రకాల సేవలకు సంబంధించిన రిజిస్టర్లు నిర్వహిస్తున్న టీచర్లు
- గ్రేటర్ సహా మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల్లో 3,307 అంగన్‌వాడీ కేంద్రాలు
- 3.43 లక్షల మంది లబ్ధిదారులు

సాక్షి,మేడ్చల్ జిల్లా: ప్రస్తుతం అన్ని రంగాలు సాంకేతిక పరిజ్ఞానంతో దూసుకెళ్తూ ప్రతీ పనిని సులభతరం చేసుకుంటున్నాయి. సంక్షేమ విభాగంలోని అంగన్వాడీ కేంద్రాలూ అదే బాటలో పయనిస్తున్నాయి. ఈ కేంద్రాలు తమ పరిధిలో 15 రకాల రిజిస్టర్లను నిర్వహిస్తాయి. గర్భిణులు, బాలింతలు, పిల్లల ఆరోగ్య సంబంధిత సమాచార సేకరణ అంగన్వాడీ ఉపాధ్యాయులకు భారమవుతున్న తరుణంలో రాష్ట్ర ప్రభుత్వం న్యూట్రిషన్ హెల్త్ ట్రాకింగ్ సిస్టమ్(ఎన్‌హెచ్‌టీఎస్) యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది.

నమోదు తప్పనిసరి...

అంగన్వాడీ టీచర్లు, ఆయాలు విధులకు ఎప్పుడు హాజరవుతున్నారు. ఏ రోజు ఎంతమంది పిల్లలకు, బాలింతలకు, గర్భిణులకు పోషకాహారాన్ని అందించారనే అంశాలను పొందుపర్చాలంటే సిబ్బంది తమ సెల్ ఫోన్‌లో ఎన్‌హెచ్‌టీఎస్‌లో యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని నమోదు చేసుకోవాలి. ఆధార్‌ను అనుసంధానం చేసిన తర్వాత ఒక ఐడీ జనరేట్ అవుతుంది.

ఎందుకీ యాప్...

రిజిస్టర్లు, కాగితాల విధానానికి స్వస్తి పలికి, సాంకేతికతను జోడిస్తూ.. అంగన్వాడీ కేంద్రాలపై అనునిత్యం అధికారుల పర్యవేక్షణ ఉండేలా ఇది దోహదపడుతుంది. దీంతో అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లు తప్పనిసరిగా ఈ యాప్‌ను నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. కేంద్రాలను టీచర్లు ఎప్పుడు తెరుస్తున్నారు. హాజరవుతున్నారా? లేదా అనే అంశాలు అధికారులకు తెలుస్తాయి. దీంతో పనిలో పారదర్శకత పెరిగే అవకాశం ఉంటుంది. సేవలను పొందే వారందరి సమాచారం ఇందులో నిక్షిప్తమై ఉంటుంది. ఆరోగ్య లక్ష్మి పథకం ద్వారా గర్భిణులు, బాలింతలు, ఆరేళ్ల పిల్లలకు సరైన సమయంలో పాలు, గుడ్లు, బాలామృతం తదితర పోషకాహారం అందిస్తున్నారా? కేంద్రాల్లో సరిపడా ఆహార పదార్థాలు అందుబాటులో ఉన్నాయా? అనే సమాచారాన్ని సిబ్బంది యాప్‌లో పొందుపరుస్తారు.

పర్యవేక్షణ మరింత సులభం...

ఎన్‌హెచ్‌టీఎస్ యాప్ అందుబాటులోకి రాక ముందు గ్రేటర్‌తో సహా నగర శివారు మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల్లోని 3,307 అంగన్వాడీ కేంద్రాలు సక్రమంగా పని చేస్తున్నాయా.. ఇందులోని 3,43,694 మంది లబ్దిదారులకు ప్రభుత్వం అందించే అన్ని సేవలు అందుబాటులో ఉన్నాయా? లేదా? అనే వివరాలను జిల్లా శిశు, మహిళా సంక్షేమ, అభివృద్ధి అధికారి, సీడీపీఓ పర్యవేక్షకులు క్షేత్రస్థాయిలోకి వెళ్లి పరిశీలించాల్సి వచ్చేది. కానీ ఇప్పుడు దేశంలోని ఏ అధికారి అయినా సులభంగా ఎక్కడి నుంచైనా కేంద్రాలను పర్యవేక్షించే అవకాశం ఉంది.

ప్రభుత్వం ఎందుకు తెచ్చిందంటే...

కేంద్రం రూపొందించిన 'పోషణ ట్రాకర్' ప్రత్యేక యాప్ దేశంలోని అన్ని రాష్ట్రాల్లో అందుబాటులో ఉంది. కానీ తెలంగాణ ప్రభుత్వం ఆరోగ్య లక్ష్మీ పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ పథకం అందించే సేవలు, లబ్దిదారుల వివరాలను సైతం యాప్‌లో పొందుపరచాలనే ఉద్దేశంతో నవంబర్‌లో రాష్ట్ర ప్రభుత్వం ఎన్‌హెచ్‌టీఎస్ యాప్‌ను రూపొందించింది. అంగన్వాడీ కేంద్రాల సేవలు వైద్యం, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలతో ముడిపడి ఉంటాయి. వీటి సమన్వయం చేసుకుంటూ.. పారదర్శకత గల సేవలను అందించేందుకు దీనిని రూపొందించారు.

పారదర్శకత పెరిగింది



గతంలో అంగన్వాడీ కేంద్రాలకు ప్రభుత్వం పంపిణీ చేసే పోషకాహార సరుకులు పెద్ద మొత్తంలో వృథా కావడంతో పాటు అక్రమాలకు తావుండేది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూపొందించిన ఎన్‌హెచ్‌టీఎస్ యాప్ ద్వారా పారదర్శకత పెరిగింది. సరుకులు పక్కదారికి పట్టే అవకాశం లేదు. అందరూ సంతోషంగా ఉన్నారు.

– ఉదయశ్రీ, సీడీపీఓ, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా

వైభవంగా మల్లికార్జున స్వామి కల్యాణం



స్వామివారి కల్యాణోత్సవం



బోనాలు సమర్పిస్తున్న భక్తులు

కీసర: చీర్యాల చౌరస్తాలో గల శ్రీభ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం శ్రీభ్రమరాంబ మల్లికార్జున స్వామి కల్యాణోత్సవాన్ని పండితులు వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి చీర్యాల, అహ్మద్‌గూడ తదితర గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు ఆలయానికి తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. కాగా సాయంత్రం మహిళలు భక్తిశ్రద్ధలతో మల్లన్నకు బోనాలు సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ చిందం నాగేష్, చిందం అశోక్, చిందం లక్ష్మయ్య, వెంకటేష్, శ్రీనివాస్, చిందం బాలేష్, కోల బాల్‌రాజ్, ఎంపీపీ ఇందిరాలక్ష్మీ నారాయణ, సర్పంచ్ తుంగ ధర్మేందర్, ఉప సర్పంచ్ తిరుమల్‌రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

గౌడవెల్లి గ్రామంలో...

మేడ్చల్: మండలంలోని గౌడవెల్లి గ్రామంలో మల్లన్న జాతర సందర్భంగా మల్లికార్జున స్వామి కల్యాణోత్సవంను ఘనంగా నిర్వహించారు. యాదవ సంప్రదాయంలో జరిగిన ఈ వేడుకలో టీపీసీసీ అధికార ప్రతినిధి హరివర్ధన్‌రెడ్డి పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సురేందర్ ముదిరాజ్, ఉపసర్పంచ్ పెంటమ్మ, యాదవసంఘం సభ్యులు పాల్గొన్నారు.



కల్యాణంలో హరివర్ధన్‌రెడ్డి

మహిళలు స్వయం ఉపాధి రంగాల్లో రాణించాలి



శిక్షణ తరగతులు ప్రారంభిస్తున్న కౌకుట్ల చంద్రారెడ్డి

కీసర: మహిళలు స్వయం ఉపాధి రంగాల్లో రాణించాల్సిన అవసరం ఎంతైనా ఉందని నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. సోమవారం మున్సిపాలిటీ పరిధిలోని సత్యనారాయణ కాలనీలో మహిళా సాధికారత కార్యక్రమంలో భాగంగా మహిళలకు ఉచితంగా కుట్టు శిక్షణ తరగతులను ప్రారంభించారు. కార్యక్రమంలో రెడ్యానాయక్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల్లో మెరుగైన పారిశుద్ధ్య నిర్వహణ

కీసర: కీసరగుట్టలో ఈ నెల 16 నుంచి 21వ తేదీ వరకు జరుగనున్న శ్రీభవానీరామలింగేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాల సందర్భంగా జాతర జరిగే ప్రాంతంలో మెరుగైన పారిశుద్ధ్య నిర్వహణకు చర్యలు చేపట్టడం జరుగుతుందని జిల్లా పంచాయతీ అధికారి రమణమూర్తి అన్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా సోమవారం జాతర జరిగే ప్రాంతంలో చేపడుతున్న పారిశుద్ధ్య పనులను ఎంపీపీ ఇందిరాలక్ష్మీ నారాయణ, ఎంపీడీఓ రమాదేవిలతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ఏటా బ్రహ్మోత్సవాల్లో సుమారు వెయ్యి మంది పారిశుద్ధ్య కార్మికులతో 24 గంటల పాటు మూడు షిఫ్టులలో పారిశుద్ధ్య పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ మంగతాయారు, గ్రామ కార్యదర్శి సురేష్‌రెడ్డి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఎండిపోతున్న హరితహారం మొక్కలు



హరితహారంలో భాగంగా నాటిన మొక్కలు మేడ్చల్‌లో ఎండు ముఖం పట్టాయి. పట్టణంలోని రాఘవేంద్రనగర్ శాంతా బయోటెక్ రోడ్లలో గతంలో మున్సిపాలిటీ సిబ్బంది మొక్కలు నాటారు. మున్సిపల్ సిబ్బంది చెత్తను, గడ్డిని తొలగించడానికి అగ్గితో తగలబెట్టడంతో ఏపుగా ఎదిగిన మొక్కలు పూర్తిగా నాశనమయ్యాయి. ఓ వైపు నీరు లేక, మరో వైపు అగ్గితో వేల రూపాయలు ఖర్చు చేసి నాటిన మొక్కలు ఎండు ముఖం పట్టాయి. అధికారులు మొక్కలను రక్షించాలని కాలనీలవాసులు కోరుతున్నారు.

–మేడ్చల్

ప్రజావాణికి 70 ఫిర్యాదులు

సాక్షి,మేడ్చల్ జిల్లా: మేడ్చల్–మల్కాజిగిరి కలెక్టరేట్ ప్రజావాణిలో సోమవారం ప్రజలు వివిధ సమస్యలపై అందజేసిన 70 ఫిర్యాదులను జిల్లా రెవెన్యూ అధికారి లింగ్యానాయక్ స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజావాణిలో తమ సమస్యలను పరిష్కరిస్తారనే నమ్మకంతో వచ్చే ప్రజల అర్జీదారులను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వివిధ శాఖలకు చెందిన అధికారులు, ఉద్యోగులు ఉన్నారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న డీఆర్ఓ తదితరులు



తన పుట్టిన రోజు సందర్భంగా సోమవారం గ్రామ పంచాయతీ కార్మికులకు నూతన దుస్తులను అందజేస్తున్న మునీరాబాద్ గ్రామ వార్డు సభ్యుడు కుతాడి నరేందర్.

– మేడ్చల్‌రూరల్



ఈ నెల 16 నుంచి 21వ తేదీ వరకు జరగనున్న కీసరగుట్ట శ్రీ భవానీ రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలకు హాజరుకావాలని సోమవారం ఎంపీ సంతోష్‌కుమార్‌ను ఆహ్వానిస్తున్న కీసరగుట్ట ఆలయ చైర్మన్ తటాకం రమేష్‌శర్మ. చిత్రంలో కీసర సర్పంచ్ నాయకపు మాధురివెంకటేష్, బీఆర్ఎస్ నేతలు నాయకపు వెంకటేష్, బాబుయాదవ్, మధుయాదవ్, కీసరగుట్ట పూజారి రవి.

– కీసర



గౌడెల్లిలో నిర్వహించిన మల్లికార్జున స్వామి జాతరలో స్వామివారిని దర్శించుకుంటున్న మంత్రి మల్లారెడ్డి. చిత్రంలో మాజీ ఎంపీపీ పద్మాజగన్‌రెడ్డి, నాయకులు దయానంద్ యాదవ్, రాజు తదితరులు. – మేడ్చల్

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి



అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్యా

శామీర్‌పేట్: ఆన్‌లైన్ మోసాలపై యువత అప్రమత్తంగా ఉండాలని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్యా అన్నారు. ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల సందర్భంగా ఆర్‌బీఐ ప్రతినిధులు సోమవారం మండల కేంద్రమైన మూడు చింతలపల్లిలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన అదనపు కలెక్టర్ మాట్లాడుతూ... లోన్‌యాప్స్ ద్వారా రుణాలను పొంది అధిక వడ్డీ చెల్లించలేక యువత ప్రాణాలు తీసుకుంటున్నారని, అలాంటి యాప్స్‌ని నమ్మొద్దని సూచించారు. ఆన్‌లైన్ బెట్టింగ్ గేమ్స్‌కి దూరంగా ఉండాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ హారిక మురళీగౌడ్, ఎంపీడీఓ రవినాయక్, స్థానిక సర్పంచ్ జాం రవి, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

డంపింగ్‌యార్డులో ప్రమాదవశాత్తు చెలరేగిన మంటలు



మంటలు పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ పావనీయాదవ్, కమిషనర్ వేమనరెడ్డి

ఘట్‌కేసర్: మున్సిపాలిటీ డంపింగ్‌యార్డులో సోమవారం ప్రమాదవశత్తు మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న చైర్‌పర్సన్ పావనీయాదవ్, కమిషనర్ వేమనరెడ్డి, స్థానిక కౌన్సిలర్ వెంకట్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని డంపింగ్‌యార్డ్ పరిసరాలను పరిశీలించారు. పక్కనే హెచ్‌పీసీఎల్ ఉన్నందున మంటలు అదుపు తప్పితే ప్రమాదం జరుగుతుందని భావించి హెచ్‌పీసీఎల్ ఫైరింజన్‌కు సమాచారమిచ్చారు. ఫైరింజన్ సిబ్బందొచ్చి మంటలు ఆర్పివేశారు. మంటలు రావడానికి గల కారణాలను అన్వేషించాలని సిబ్బందిని చైర్‌పర్సన్, కమిషనర్ ఆదేశించారు. కార్యక్రమంలో జంగయ్య యాదవ్, హెచ్‌పీసీఎల్ ఫైర్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

అధ్యాపకులు నిత్యాన్వేషి కావాలి

ఘట్‌కేసర్: అధ్యాపకులు నిత్యాన్వేషి అయినప్పుడే విద్యార్థులకు బోధించగలరని అనురాగ్ యూనివర్సిటీ(ఏయూ) ఉపకులపతి రాంచంద్రం అన్నారు. వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో 'కృత్రిమ మేధస్సు'పై అధ్యాపకులకు సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధ్యాపకులు అన్ని రంగాల్లో ముందుండాలని, కృత్రిమ మేధస్సు అభివృద్ధితో పోటీ పడాలని, విద్యార్థుల ఉన్నతికి మూలకారణం కావాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ కిరణ్‌కుమార్, విజయ్‌కుమార్, సతీశ్‌కుమార్, మల్లికార్జున్, డాక్టర్ కృష్ణ, మనోరంజన్‌దాస్, అధ్యాపకులు పాల్గొన్నారు.



సదస్సులో వీసీ రాంచంద్రం, రిజిస్ట్రార్ ఫాతిమా, అధ్యాపకులు

విద్యా వలంటీర్లకు వేతనాల అందజేత



విద్యా వలంటీర్లకు వేతనం అందజేస్తున్న దృశ్యం

ఘట్‌కేసర్: పట్టణంలోని జెడ్పీ బాలికల పాఠశాలలో హిందీ, తెలుగు ఉపాధ్యాయుల కొరత ఉన్నందున జన చైతన్య సేవా సమితి ఆధ్వర్యంలో ఇద్దరు విద్యా వలంటీర్లను గతంలో నియమించారు. వారి జనవరి మాసం వేతనం ఒక్కరికి రూ.7వేల చొప్పున ఇద్దరికి కలిపి రూ.14 వేలను జన చైతన్య సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ సర్పంచ్ యాదగిరియాదవ్ ఆదేశం మేరకు సంఘం సభ్యులు అనీల్‌కుమార్, ప్రవీణ్‌యాదవ్ సోమవారం అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం అనిత, సంస్థ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

మంత్రికి ఆహ్వానం



మంత్రికి ఆహ్వాన పత్రిక ఇస్తున్న సర్పంచ్ వెంకటేశ్‌గౌడ్, ఉపసర్పంచ్ రాజు

ఘట్‌కేసర్: కొర్రెములలో కబడ్డీ అంతర్జాతీయ క్రీడాకారుడు మునుకుంట్ల రమేశ్‌గౌడ్ 27వ వర్ధంతిని పురస్కరించుకుని రమేశ్ హనుమాన్ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి కబడ్డీ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా మంత్రి మల్లారెడ్డి, జెడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, బీఆర్ఎస్ మల్కాజ్‌గిరి ఇన్‌చార్జి రాజశేఖర్‌రెడ్డి, రాష్ట్రీర నేత భద్రారెడ్డిని వారి నివాసంలో కలిసి ఆహ్వాన పత్రికను సోమవారం అందజేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ రాజుముదిరాజ్, మాజీ ఉప సర్పంచ్ నాగార్జున, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రమేశ్, హనుమాన్ యూత్ క్లబ్ సభ్యులు వెంకటేశ్‌యాదవ్, శ్రీహరి, నర్సింగ్, సుభాశ్, శివ, మల్లేశ్ పాల్గొన్నారు.



బస్టాండ్ ఆవరణలో ప్రవహిస్తున్న మురుగు

మురికి కూపంగా బస్టాండ్ ఆవరణ

నాలా జామ్ కావడంతో లీకవుతోన్న డ్రైనేజీ మురుగు

మేడ్చల్: పారిశుద్ధ్య నిర్వహణ లోపంతో మేడ్చల్ ఆర్టీసీ బస్టాండ్ దుర్గంధంగా మారింది. బస్టాండ్ పరిసర ప్రాంతంలో గల పలు కాలనీల నుంచి వెలువడే మురికి నీరు పల్లపు ప్రాంతమైన పెద్ద వాగువైపు తరలించేందుకు బస్టాండ్ ఆవరణ మీదుగా భూగర్భ డ్రైనేజీ కాలువ నిర్మించారు. బస్ డిపో గేట్ ముందు కాల్వలు పూర్తిగా చెత్తతో నిండి మూసుకుపోవడంతో కాలువ ఆవరణలో మురుగు నీరు పూర్తిగా నిలిచిపోయి మురికి కూపంగా తయారైంది. వారం రోజులుగా మురికి నీరు ప్రవహిస్తుండటంతో ముక్కు పుటాలదిరేలా దుర్గంధం వెదజల్లుతోంది. బస్సులు, కార్మికులు డిపోలో గేట్ ముందు నుంచి రాకపోకలు సాగిస్తుంటారు. బస్టాండ్ ఆవరణ మురికి మయంగా మారడంతో బస్టాండ్‌లో ప్రయాణీకులు 10 నిమిషాలు వేచి ఉండని పరిస్థితి నెలకొంది. ఒక వైపు దు ర్గంధం, మరో వైపు దోమలు, చెత్తాచెదారంతో బసా ండ్ అంతటా కంపు కొడుతుంది. మున్సిపల్ అధికారులు మరమ్మతులు చేసినా అవి తూతూ మంత్రంగా ఉండటంతో సమస్య తాండవం చేస్తోంది. తమ సమస్యను పట్టించుకుని శాశ్వత పరిష్కారం చూపాలని ప్రయాణీకులు, ఆర్టీసీ సిబ్బంది కోరుతున్నారు.



డిపో గేటు ముందు ప్రవహిస్తున్న మురికి నీరు



ఆవరణలో మురికి కూపం